సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం ¦ 14 ¦ జూలై ¦ 2025



చిక్కని చిరుత

మహబూబ్‌నగర్ టీడీగుట్ట పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత ఆచూకీ నేటికీ లభించలేదు.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం భారీగా తగ్గింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.0 /22.1

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై చిరు జల్లులు కురవచ్చు.

న్యూస్‌రీల్

నూతన క్రీడా అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికారి సంస్థ (శాట్) ఆధ్వర్యంలో గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా అకాడమీల్లో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025– 26 ప్రవేశానికి గచ్చిబౌలిలో హాకీ, అథ్లెటిక్స్ అకాడమీల్లో బాలుర, బాలికలకు ఎల్‌బీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ అకాడమీల్లో బాలురకు ఈ నెల 15, 16 తేదీల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 12– 16 ఏళ్లలోపు ఆసక్తిగల క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్ పాఠశాల లేదా కళాశాల, తహసీల్దార్ లేదా పంచాయతీ, మున్సిపాలిటీల నుంచి జనన ధృవీకరణ సర్టిఫికెట్, క్రీడా ధృవీకరణ పత్రాలు, 10 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఒరిజినల్, జిరాక్స్‌లతో ఉదయం 7 గంటలకు హాజరుకావాలని కోరారు.

'బీసీలకు రాజ్యాధికారం దక్కాలి'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీసీలకు రాజ్యాధికారం దక్కాల్సిందేనని బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక టీఎన్‌జీఓ సమావేశ మందిరంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడం హర్షణీయమన్నారు. దీనికి చట్టబద్ధత కల్పించేందుకు తక్షణమే పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా అఖిలపక్ష నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలన్నారు. ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా రాజకీయాలకతీతంగా బీసీలు సంఘటితం కావాలన్నారు. కాగా, బీసీ నినాదంతో ముందుకు వచ్చి.. మన ఓటు మనకే వేసుకుని.. అన్ని అవకాశాలను అందిపుచుకోవడానికి అన్ని కుల సంఘాలు కృషి చేస్తాయని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, గోపాల్‌యాదవ్, బెక్కెం జనార్దన్, వసంత, బ్రహ్మయ్య, రాఘవేంద్రరాజు, పురుషోత్తం, కొండయ్య పాల్గొన్నారు.



చిన్నదర్పల్లి అటవీ బీట్ ఏరియాలో ఎస్ఎంఎం మిక్స్‌డ్ ప్లాంటేషన్ ఇది. 2021- 22 సంవత్సరంలో ఇక్కడ మొత్తం 5 హెక్టార్ల విస్తీర్ణంలో 5,555 మొక్కలు (నేరేడు, వేప, ఏరుమద్ది, సీమ చింత, మారేడు, నెమలి నార, చింత, రావి, ఇప్ప జాతులు) నాటారు. అయితే ఇందులో ప్రతి 20 మొక్కల్లో ఐదు వరకు పూర్తిగా ఎండిపోయి పచ్చని మొక్కల మధ్య ఎగతాళి చేస్తున్నాయి. ఈ ప్లాంటేషన్ చేసి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా మొక్కలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, ఎండిపోయి కనిపించడం అటవీశాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.



పెద్దదర్పల్లి అటవీ బీట్ ఏరియాలో ఏర్పాటు చేసిన బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా 10 హెక్టార్ల విస్తీర్ణంలో 8,500 మొక్కలు (మర్రి, రావి, మేడి, వేరుమద్ది, అల్లనేరేడు, చింత, వేప, సీమ చింత, మహాగని, వెలగ, నెమలినార, ఉసిరి జాతులు) నాటారు. ఇక్కడ కూడా నిర్వహణ లోపం కారణంగా మొక్కలు పెరగడం లేదనేది స్పష్టమవుతోంది. దీంతో ప్లాంటేషన్ చేసిన వాటిలో వందలాది మొక్కలు ఎదుగుదల లేక ఇలా కునారిల్లుతున్నాయి.

నిలువెత్తు నిర్లక్ష్యం

జిల్లాలో నెరవేరని వనమహోత్సవం లక్ష్యం

- ఇప్పటి వరకు నాటిన వాటిలో 30 శాతం వరకు వృథా
- మొక్కలు నాటేందుకే పరిమితమవుతున్న యంత్రాంగం
- పచ్చదనంలోనూ దర్శనమిస్తున్న ఎండిన మొక్కలు
- నిర్వహణ లోపంతో ఎదుగుదల కోల్పోయి కునారిల్లుతున్న వైనం



హన్వాడ మండలం దాచక్‌పల్లిలో వన మహోత్సవానికి సిద్ధమైన నర్సరీ

గ్రాండ్ రిపోర్ట్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటి అడవుల శాతం పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా నర్సరీల్లో లక్షలాది మొక్కలు పెంచి.. వర్షాలు పడిన వెంటనే నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతారు. ఇలా నాటిన మొక్కలకు ప్రతి సంవత్సరం సర్వైవల్ తనిఖీలు చేయడంతో పాటు ప్లాంటేషన్ స్థలాలను సైతం మొక్కల జియోట్యాగింగ్ చేస్తారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం, లెక్కలేనితనం మూలంగా ప్రభుత్వ ఆశయం అభాసుపాలవుతోంది. గత పదేళ్ల కాలంలో జిల్లాలో హరితహారం, వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో దాదాపు 7,61,62,084 మొక్కలు నాటగా.. నిర్వహణ లోపంతో దాదాపు 30 శాతం వరకు మొక్కలు బతకడం లేదు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన ఆయా ప్రభుత్వ శాఖలు నిర్వహణపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కనీసం ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి కూడా నాటడంలోనూ పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

మూడు శాఖల ఆధ్వర్యంలో..

జిల్లాలో ప్రధానంగా మూడు ప్రభుత్వ శాఖల పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని నర్సరీలు ఏర్పాటు చేస్తారు. అటవీ, మున్సిపాలిటీ, గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఓ)ల ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసి వాటిలో ఎవెన్యూ ప్లాంటేషన్, ఇంటి పరిసరాలు, పొలం గట్లు, అటవీ ప్రాంతంలో, చెరువు కట్టలు, శిఖం భూములు, ప్రభుత్వ భూముల్లో విరివిగా నాటేందుకు రకరకాల మొక్కలు పెంచుతారు. అయితే ఆయా నర్సరీల్లో నిర్ణీత సైజులో మొక్కలు పెరగకపోడం, రోజుల తర్వాత నాటడంతో అవి సరిగా బతకక ఎండిపోయి కనిపిస్తున్నాయి. కాగా.. ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను సందర్శించి ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటేలా చర్యలు తీసుకోవాలి. కానీ, ఒక్కసారి మొక్కలు నాటిన తర్వాత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని తెలుస్తోంది.

జిల్లా భౌగోళిక విస్తీర్ణం	ఇందులో అడవులు
2,73,796 హెక్టార్లు	22,869 హెక్టార్లు
ఇప్పటి వరకు నాటిన మొక్కలు	ఈసారి నాటనున్న మొక్కలు
7,61,62,084	58 లక్షలు

సోషల్ ఆడిట్‌లో వెలుగులోకి..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఓ) ఆధ్వర్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేయడం, దానికి తగ్గట్టుగా మొక్కలు నాటడం ప్రధాన అంశంగా పెట్టుకున్నారు. కూలీల ద్వారా గుంతలు తవ్వించడం, నాటడంతోపాటు గ్రామ పంచాయతీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. రెండేళ్లపాటు నిర్వహణ కోసం ప్రతినెలా నీళ్ల ట్యాంకర్‌కు కిరాయి చెల్లిస్తారు. అయితే ఈ డబ్బులు ఆరేడు నెలలకోసారి రావడంతో మొక్కల నిర్వహణపై నిర్లక్ష్యం ఆవహించింది. ఇటీవల జిల్లాలో నిర్వహించిన మూడు మండలాల సోషల్ ఆడిట్‌లోనూ ఇదే విషయం బయటపడటం గమనార్హం.

డబ్బుల విడుదలలో ఆలస్యం..

రైతులు పొలం గట్లపై, బ్లాక్ ప్లాంటేషన్లు చేసుకున్న వాటికి సంబంధించి నిర్వహణ కోసం ప్రతి నెలా మొక్కకు రావాల్సిన డబ్బుల విడుదలలో ఆలస్యం, గ్రామ పంచాయతీల పరిధిలో నాటే మొక్కలకు నిర్వహణ డబ్బులు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో నిర్వహణకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ప్రభుత్వం నుంచి మెయింటెనెన్స్ డబ్బుల విడుదలలో అలసత్వం సర్వైవల్ పర్సంటేజీ పెరగడానికి ఓ కారణంగా చెప్పవచ్చు.

చిత్తశుద్ధితో చేపట్టాలి..



భవిష్యత్ తరాల మనుగడ కోసం పర్యావరణ **సమతుల్యత**ను సాధించేలా హరితహారం, **వనమహోత్స**వం కార్యక్రమాల ద్వారా నాటుతున్న మొక్కలను సంరక్షించాలి. మొక్కల నిర్వహణలో చిత్తశుద్ధి లేకపోతే అది సాధ్యం కాదు. మొక్కలు నాటడమే కాకుండా.. వాటిని కాపాడటంలోనూ ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి.

– లక్ష్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నిర్లక్ష్యం వద్దు..



హరితహారం, వనమహోత్సవ కార్యక్రమాల్లో నాటిన మొక్కల సంరక్షణకు సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని ఆయా శాఖల అధికారులకు సూచించాం. సర్వైవల్ పర్సెంటేజీని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా లోపాలుంటే సంబంధిత అధికారులకు సూచిస్తాం.

– సత్యనారాయణ, జిల్లా అటవీ శాఖాధికారి



దాచక్‌పల్లిలో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

పాత అలుగుకు చేరువలో.. కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ నీటిమట్టం పాత అలుగుకు చేరువలోకి వచ్చింది. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా.. ఆదివారం సాయంత్రం వరకు 24 అడుగులకు చేరింది. దీంతో కేవలం 2.6 అడుగుల నీరు చేరితే పాత అలుగు స్థాయికి చేరుకుంటుంది. అలాగే ప్రాజెక్టు గేట్ల స్థాయి 32.6 అడుగుల మేర ఉండగా మరో 8.6 అడుగుల నీరు చేరాల్సి ఉంది. ఈ ఏడాది ముందస్తు వర్షాల వల్ల జూరాలకు మే నెల చివరి వారంలోనే ఇన్‌ఫ్లో రావడంతో జూన్ 1 నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేశారు. 6న కోయిల్‌సాగర్‌కు నీరు చేరడం ప్రారంభమైంది. గడిచిన 38 రోజుల పాటు ఒక పంపు ద్వారా ప్రతిరోజు 315 క్యూసెక్కుల నీరు నిరంతరం చేరుతుండటంతో ప్రాజెక్టులో క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. జూరాల నుంచి నీరు రాక ముందు 11 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 13 అడుగుల మేర పెరిగింది.

బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ చరిత్రలో మైలురాయి


స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్ సామాజిక చరిత్రలో ఒక మైలురాయి అని, ఇది న్యాయబద్ధమైనదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల ఇన్‌చార్జీ సంజీవ్ ముదిరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ ఉద్యమకారులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాలు అందరూ కలిసి ఈ చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లో సవరణలు చేస్తూ, ఆర్టికల్ 213 ప్రకారం ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. దీని వల్ల బీసీ రిజర్వేషన్లు పెరుగుతాయన్నారు. ఈ ఆర్డినెన్స్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రాజకీయ హామీని కాదు, ఒక సామాజిక బాధ్యతను నెరవేర్చనుందన్నారు. తద్వారా తెలంగాణ ప్రభుత్వం బీసీ వర్గాలను పాలనలో భాగస్వామ్యం చేసే చారిత్రక ఆరంభానికి దారితీస్తుందని ఆయన పేర్కొన్నారు.

కాలుష్యపు కోరల్లో.. కృష్ణమ్మ

కృష్ణానదిలో కలుస్తున్న పరిశ్రమల వ్యర్థాలు

జీవనది కృష్ణమ్మ ఉమ్మడి పాలమూరు జిల్లాలో సుమారు వంద కి.మీ., మేర పారుతూ.. కోట్లాది మందికి తాగునీరు, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. అలాగే లెక్కకు మించి జీవరాశులు, వన్యప్రాణులు, మత్స్య సంపదకు జీవనాధారమైంది. ఇంతటి ప్రాముఖ్యత గల కృష్ణానది క్రమంగా కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటోంది. ఎగువనున్న కొన్ని పరిశ్రమల నుంచి కాలుష్యపు నీటిని గుట్టుచప్పుడు కాకుండా కృష్ణానదిలోకి వదిలేస్తున్నారు. ఫలితంగా కృష్ణాజలాలు ఆకు పచ్చరంగులోకి మారుతూ విషపూరితమవుతున్నాయి. ఈ పరిస్థితిని అడ్డుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దరిదాపుల్లో లేకపోగా.. ఇతరత్రా అధికార యంత్రాంగం తమ పరిధిలో లేదంటూ చేతులు దులుపుకొంటోంది.

- పలు ప్రాంతాల్లో ఆకుపచ్చ రంగులోకి నది నీరు
- మూడేళ్లుగా అధికమవుతున్న నీటి కాలుష్యం
- వరదలతో దిగువకు పారుతున్న కలుషిత జలాలు
- దరిదాపుల్లో కానరాని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు



కృష్ణానది ప్రవాహంలో ఆకుపచ్చని రంగులో ఉన్న నీటి తెట్టెలు

కొల్లాపూర్: ఉమ్మడి పాలమూరు జిల్లా మీదుగా కృష్ణానది దిగువకు ప్రవహిస్తుంటుంది. అయితే కృష్ణానది తీరం వెంట పలు రసాయన, ఔషధ, ఆల్కహాల్ పరిశ్రమలు నెలకొల్పారు. వాటి వ్యర్థాలను నది తీరంలోకి వదిలిపెడుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పరిశ్రమలు పట్టించుకోవడం లేదు. అలాగే నది తీర గ్రామాల్లోని చెత్తాచెదారాన్ని కూడా తీరం ఒడ్డునే పారబోస్తున్నారు. దీంతో ఎగువ నుంచి వరద జలాలు వదిలిపెట్టినప్పుడు కలుషితాలన్నీ నీటిలో కలిసి దిగువకు ప్రవహిస్తున్నాయి. కృష్ణానదికి ఉపనదులుగా ఉన్న తుంగభద్ర, మలప్రభ, ఘటప్రభ వంటి నదుల నుంచి కూడా కాలుష్య కారకాలు వచ్చి కృష్ణానదిలో కలుస్తున్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గ సరిహద్దులోనే ఆయా నదులు సంగమం అవుతుంటాయి. కాలుష్య కారకాల వల్ల జటప్రోల్, మంచాలకట్ట, మల్లేశ్వరం, సంగమేశ్వరం, సోమశిల, అమరగిరి పరిసర ప్రాంతాల్లో నది నీళ్లు పచ్చగా మారుతున్నాయి. గత మూడేళ్లుగా నీళ్లు ఈ విధంగా కనిపిస్తున్నాయి. తీర ప్రాంతాల్లో కిలోమీటర్ల పొడవునా ఇలా నీటిపై పచ్చని రంగులో తెట్టెలు దర్శనమిస్తున్నాయి. నీటిమట్టం తగ్గేకొద్దీ కలుషిత నీరు అంతా దిగువకు ప్రవహిస్తూ పోతుంది.



సోమశిల సమీపంలో కృష్ణానది బ్యాక్‌వాటర్

కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా..

ఉమ్మడి మహబూబ్‌నగర్– రంగారెడ్డి జిల్లాలకు కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ స్కీం నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ స్కీంకు కృష్ణానది నీటినే వినియోగిస్తున్నారు. కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసే కృష్ణా నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కాలుష్య కాటుకు గురవుతున్న నీటిని సక్రమంగా శుద్ధి చేయకుంటే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యం, మత్స్యసంపద వృద్ధికి ఇబ్బందికరంగా నీటి కాలుష్యం మారక ముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్య సంపదకూ ముప్పే..

నీటి కాలుష్యంతోపాటు గుర్రపు డెక్క కూడా కృష్ణానదిలో విస్తరిస్తోంది. ఎగువ నుంచి కిందకి నీళ్లు వచ్చినప్పుడు తీరప్రాంతాల్లోని చెత్తాచెదారంతో పాటు గుర్రపు డెక్క కూడా వస్తోంది. ఇది శ్రీశైలం డ్యాం వరకు నిదానంగా చేరుతోంది. కాలుష్యం, గుర్రపుడెక్క కారణంగా నదిలోని మత్స్య సంపదకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అలివి వలల కారణంగా నదిలో చేపలు పెరగడం లేదు. కాలుష్యం కూడా దీనికి తోడైతే మత్స్యకారుల జీవనోపాధికి ఇక్కట్లు తప్పవు.



కృష్ణానదిలో విస్తరిస్తున్న గుర్రపు డెక్క

శుద్ధి చేసిన నీటినే..



మిషన్ భగీరథ స్కీంకు కృష్ణానది నుంచి ఎత్తిపోసే నీటినే వినియోగిస్తున్నాం. ఈ నీళ్లను రెగ్యులర్‌గా ఫిల్టర్ చేసి సరఫరా చేస్తున్నాం. మట్టి, చెత్త ఏమున్నా ఫిల్టరింగ్‌లో వెళ్లిపోతుంది. ఆరోగ్యానికి హాని కలిగించని ఖనిజ లవణాలు మాత్రమే ఉంటాయి. నీటి ఫిల్టరింగ్‌ను రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తాం. నది నీటి కాలుష్యాన్ని పర్యవేక్షించే బాధ్యత మా శాఖ పరిధిలో లేదు.


– అంజాద్‌పాషా, డీఈఈ, మిషన్ భగీరథ

మా దృష్టికి రాలేదు..

కృష్ణానదిలో కాలుష్య కారకాలు కలుస్తున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. ఇది మా పరిధిలోని అంశం కాదు. కాలుష్య నివారణ బోర్డుకు సంబంధించిన అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– భన్సీలాల్, ఆర్డీఓ, కొల్లాపూర్

ఆకుపచ్చగా మారుతున్నాయి..



కృష్ణానదిలో నీళ్లు మూడేళ్లుగా పచ్చగా మారుతున్నాయి. ఇవి పై నుంచి వస్తున్నాయి. ఎగువ నుంచి వరద వచ్చినప్పుడు నీళ్లపై ఆకుపచ్చ రంగులో తెట్టెలు ఉంటున్నాయి. నీళ్లు తగ్గే సమయంలో అధికంగా కనిపిస్తాయి. ఈ ఏడాది కూడా కొన్నిచోట్ల ఈ నీటి తెట్టెలు కనిపించాయి. ఈ విషయం ఇక్కడికి వచ్చే అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– బాలరాజు, మంచాలకట్ట, పెంట్లవెల్లి మండలం

ఉత్సాహంగా నెట్‌బాల్ సెలక్షన్స్ ట్రయల్స్

- ఐదు విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక



నెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పురుష, మహిళా జట్ల సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహించారు. 5 విభాగాల్లో ఎంపికలకు గాను 94 మంది పురుషులు, 64 మంది మహిళా క్రీడాకారిణులు పాల్గొన్నారు. తమిళనాడు రాష్ట్రం నమక్కల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే 17వ సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్, 18, 19 తేదీల్లో జరిగే 2వ ఫాస్ట్ 5 సౌత్‌జోన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్, 19, 20 తేదీల్లో జరిగే మొదటి సౌత్‌జోన్ నేషనల్ మిక్స్‌డ్ పోటీలు, హర్యానా రాష్ట్రం పల్వాల్‌లో వచ్చేనెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే 4వ ఫాస్ట్‌5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్, 2వ సీనియర్ నేషనల్ మిక్స్‌డ్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లలో పాల్గొనే పురుషుల, మహిళా జట్లు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న జాతీయస్థాయి టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్లు మెరుగైన ప్రతిభకనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు రాంమోహన్‌గౌడ్, ఖాజాఖాన్, సయ్యద్ అంజద్‌అలీ, సీనియర్ క్రీడాకారులు అక్రం, ముంతాజ్, షరీఫ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉలిగేపల్లిలో విద్యార్థి బలవన్మరణం


హరికృష్ణ (ఫైల్)

మల్దకల్: చదువుకోమని తండ్రి మందలించగా.. కొడుకు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో ఉలిగేపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. ఉలిగేపల్లికి చెందిన కుర్వ కిష్టన్న, నవారమ్మకు ముగ్గురు కుమారులు. మొదటి కుమారుడు హరికృష్ణ(16) ఇటీవల పదో తరగతి పాసయ్యాడు. హరికృష్ణ నాలుగు రోజుల కిందట నల్గొండ జిల్లా సర్వేలలో టీఎస్ ఆర్‌జేసీలో ఇంటర్ అడ్మిషన్ పొందాడు. ఇదిలా ఉండగా హరికృష్ణ ఇంటర్ చదివేందుకు నిరాకరించాడు. దీంతో తండ్రి మందలించగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


బత్తుల శివన్న (ఫైల్)

కొత్తకోట రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొత్తకోట మండలం పామాపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా.. పామాపురం గ్రామానికి చెందిన బత్తుల శివన్న(45)కు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. శివన్న గ్రామంలోనే ఉంటూ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈక్రమంలో ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేశాడు. దీంతో కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. అప్పుల బాధ ఎక్కువవడంతో చేసేదే లేక ఈనెల 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న పక్కింటి వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఇంటికి చేరుకున్న భార్య బత్తుల లక్ష్మి అపస్మారక స్థితిలో ఉన్న భర్తను 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివన్న ఆదివారం మృతి చెందాడు.మృతుడిభార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

- చేపలకుంటలో పడి వ్యక్తి.. ఉరేసుకుని మహిళ

నవాబుపేట: మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని సత్రోనిపల్లితండాలో చేపలకుంటలో పడి వ్యక్తి మృతిచెందాడు. దమ్మంబాయితండాకు చెందిన బన్ని (22) అమ్మమ్మ గ్రామం సత్రోనిపల్లిలో ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున వాకింగ్ వెళ్లి ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలో రైతు ఏర్పాటు చేసుకున్న చేపలకుంటలో పడి మృతిచెందాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు. అలాగే మండలంలోని తిమ్మయ్యపల్లిలో మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం తిమ్మయ్యపల్లికి చెందిన భేరి అరుణ(28) భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో మనోవేదనకు గురై ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మృతురాలి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


దామోదర్‌గౌడ్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీష్ కథనం మేరకు.. మండలంలోని కల్వకోలుకు చెందిన కర్నాటి దామోదర్‌గౌడ్ (48) రెండ్రోజులుగా కనిపించకపోవడంతో భార్య కర్నాటి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదివారం సింగోటం చెరువులో ఒంటిపై గాయాలతో మృతదేహం కనిపించగా బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కొత్తకోట రూరల్: పట్టణంలో ఎస్సీ కాలనీకి చెందిన మ్యాదరి బన్ని తప్పిపోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్ వివరాల మేరకు.. మ్యాదరి సింధూ, బాబుల కుమారుడు చిన్న కుమారుడు బన్ని పెద్దమందడి ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 10న జ్వరం వచ్చిందని ఇంటికి వచ్చాడు. దీంతో తరచూగా ఇంటికి ఎందుకు వస్తున్నావని మందలించారు. దీంతో అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కలగానే కొత్త ఠాణాలు..!


మహమ్మదాబాద్ పోలీసు స్టేషన్

- నూతన మండలాలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్న వైనం
- పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు వీడని గ్రహణం
- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- అత్యవసర సమయాల్లో ఇబ్బందులు

గండేడ్: జిల్లాలో నూతన ఠాణాల ఏర్పాటు ఓ కొలిక్కి రావడంలేదు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలు, మండలాల విభజన జరిగింది. నూతనంగా ఏర్పాటైన మండలాల్లో అన్ని శాఖల కార్యాలయాలు విడివిడిగా ఏర్పాటు చేసినా.. పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు మాత్రం గ్రహణం వీడడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో 17 మండలాల్లో గండేడ్, కొకుంట్ల మండలాలు నూతనంగా ఏర్పడ్డాయి. ఉమ్మడి గండేడ్ మండలం 75వేలకు పైగా జనాభా, 24 గ్రామపచాయతీలతో ఉండేది. 2020లో దీన్ని రెండు మండలాలుగా విభజించారు. ఈ రెండు మండలాల పరిధిలో కొత్త గ్రామపంచాయతీలను కూడా ఏర్పాటు చేశారు. రెండు మండలాల్లో గతంలో 24కు బదులు 49 గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. మహమ్మదాబాద్‌లో 22 గ్రామపంచాయతీలు ఉండగా గండేడ్‌లో 27 గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారు. అప్పటి నుండి రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఎంపీడీఓ ఇతర శాఖలు రెండు మండలాలకు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కానీ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆవశ్యకత ఎంతో ఉన్న నూతన పోలీస్‌స్టేషన్లు మాత్రం కొత్త మండలాల్లో ఏర్పాటు కాలేదు.

ఉమ్మడి మండలానికి ఒకే పోలీస్‌స్టేషన్..

ఉమ్మడి మండలాలకు మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ ఒక్కటే ఉంది. కొత్త మండలాలు ఏర్పడ్డాక అవసరం ఉన్న మండలాలకు కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారని చెప్పారు. కాని అది నేటికి కలగానే మిగిలింది. రెండు మండలాల భౌగోళిక స్వరూపం ఎక్కువగా ఉండడంతో పర్యవేక్షణ కొంత కష్టంగా ఉంది. తండాలు సైతం 45 వరకు ఉన్నాయి. అవి కూడా మెయిన్ రోడ్లకు దూరంగా ఉండడంతో అత్యవసర సమయాల్లో ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా గండేడ్ మండలంలోని గోవింద్‌పల్లి తండా, పీర్ల బండతండా, పగిద్యాల్, పరుగుల తండా, జిన్నారం, జిన్నారం తండా, ఎల్మిల్లా పెద్దవార్వాల్, చిన్నవార్వాల్ తదితర గ్రామాలకు సకాలంలో సేవలు అందడం కష్టతరంగా మారింది. రాత్రివేళల్లో మహమ్మదాబాద్ నుంచి రావాలంటే ఇక్కట్లు ఎదుర్కోక తప్పడం లేదు. గతంలో కొన్నాళ్ల పాటు గండేడ్ మండల కేంద్రంలో ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసినా తర్వాత దానిని ఎత్తేశారు. ఉమ్మడి పోలీస్‌స్టేషన్ అయిన మహమ్మదాబాద్‌లో కేసుల సంఖ్య కూడా పెరుగుతుంది. గతేడాది 316 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఆరు నెలల్లోపే కేసుల సంఖ్య 180కు చేరాయి. దేవరకద్ర నుంచి కొత్తగా కొకుంట్ల మండలం కూడా ఏర్పాటైంది. ఈమండలానికి కూడా మిగతా కార్యాలయాలు వేరుగా ఏర్పడినా.. పోలీస్‌స్టేషన్ మాత్రం ఏర్పాటు కాలేదు. ఇదిలాఉండగా, పోలీస్‌స్టేషన్లు దూరంగా ఉండడంతో చోరీలు, ఇతర ఘటనలు జరిగిన సమయంలో పోలీసులు అక్కడికి వెళ్లేలోపు దొంగలు, నిందితులు తప్పించుకుంటున్నారు.

నిమిషాల వ్యవధిలోనే దొంగలు పరార్..

గండేడ్ మండల కేంద్రంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకొని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్యాంకు ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఏటీఎంలో చోరీకి దొంగల విఫల యత్నం చేశారు. రాత్రివేళల్లో ఏమైన అత్యవసరంగా డబ్బులు అవసరం అయితే తీసుకోవడానికి వీలుగా అక్కడ ఉన్న ఏటీఎంను ఎప్పుడూ తెరిచి ఉంచుతారు. గతేడాది ఆగస్టు 3వ తేదీ తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో ముగ్గురు దొంగలు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ఓవైపు కట్‌చేశారు. ఇంతలోనే సంబంధిత బ్యాంకు మేనేజర్ శరత్‌చంద్రకు మెసేజ్ వెళ్లగా.. ఆయన వెంటనే ఏటీఎం ఉన్న ఇంటి ఓనర్‌కు, మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డికి ఫోన్‌చేసి సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకునే నిమిషాల వ్యవధిలోనే దొంగలు తప్పించుకున్నారు. ఎస్ఐ శేఖర్ రెడ్డి హుటాహుటిన అక్కడికి వెళ్లడంతో రూ.13.29 లక్షలు భద్రంగా ఉన్నాయి. అదే గనక మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్ ఉంటే పక్కాగా దొంగలు పట్టుబడేవారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది.


గండేడ్ ఏటీఎంలో చొరబడిన దొంగలు (ఫైల్)

ఎన్‌హెచ్‌పై తరచూ ప్రమాదాలు

మండల కేంద్రం గుండా వెళ్లే చించోళి – మహబూబ్‌నగర్ అంతరాష్ట్ర రహదారి జాతీయ రహదారిగా మారింది. మహమ్మదాబాద్ నుంచి జానంపల్లి వరకు తరుచూ ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉంటాయి. ఈ పరిస్థితుల్లో పోలీసులు అందుబాటులో ఉంటే సకాలంలో సేవలందించే వీలుంటుంది. అంతేకాక ఈ ప్రాంతం నుంచి కలప, ఇసుక, మట్టి, పశువులు అక్రమ రవాణా చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని అరికట్టడానికి కూడా పోలీస్‌లు అవసరం. వారు గండేడ్ మండల కేంద్రంలో ఉంటే సమాచారం అందుకున్న అరగంటలోపే అక్కడికి చేరుకొనే వీలుంటుంది. దీనికి తోడు గ్రామాల్లో ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు కూడా ఇబ్బందులు తలెతుత్తున్నాయి. గతంలో పగిద్యాల్ , వెన్నాచేడ్ గ్రామాల్లో అనుకోని సంఘటనలు జరిగినపుడు కోయిల్‌కొండ, హన్వాడ మండలాల నుంచి పోలీసులను పిలిపించాల్సి వచ్చింది. అదే ఇక్కడ పోలీసులు అందుబాటులో ఉండి ఉంటే పరిస్థితి త్వరగా అదుపులోకి వచ్చేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని రెండు మండలాలకు నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

కొంత ఇబ్బందే..



కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. కానీ పోలీస్‌స్టేషన్ దూరంగా ఉన్నా బ్లూ కోర్టు వారు నిత్యం గండేడ్ మండలంలో ఏదో చోట తిరుగుతూనే ఉంటారు. ఎక్కడ నుండి 100 కాల్‌గాని, ఇతర సమాచారం గాని వస్తే వెంటనే అక్కడికి వెళ్లిపోతున్నారు. కాకపోతే గోవిందుపల్లి, పీర్లబండ, జిన్నారం, జిన్నారం తండా వంటి గ్రామాలకు అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుంది. – శేఖర్‌రెడ్డి, ఎస్ఐ, మహమ్మదాబాద్

జూరాలకు భారీగా తగ్గిన వరద


పూర్తిస్థాయి నీటిమట్టంలో జూరాల జలాశయం

- కేవలం 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- ఒక క్రస్ట్ గేట్ ఎత్తి దిగువకు విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఆదివారం వరద భారీగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 65 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. కేవలం ఒక క్రస్టుగేట్ ఎత్తి 6,823 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. జల విద్యుదుత్పత్తి నిమిత్తం 36,035 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 1,300, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 470, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 950, భీమా లిఫ్ట్–2కు 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.087 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 115.731 మి.యూ., దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 137.467 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని ఎస్ఈ శ్రీధర్ వివరించారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 253.198 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

నిండుకుండలా కృష్ణమ్మ..

కొల్లాపూర్: కృష్ణానది నిండుకుండను తలపిస్తోంది. ఎగువ నుంచి వరద పోటెత్తడంతో శ్రీశైలం బ్యాక్ వాటర్ లేవెల్ పెరిగింది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తుండటంతో ఫుల్‌గేజ్‌కు 2 ఫీట్ల మేర దిగువకు చేరింది. శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్ లేవల్ ఫుల్‌గేజ్ 885 అడుగులు కాగా.. ఆదివారం 883.30 అడుగులు ఉన్నట్లు అధికారులు వివరించారు. సోమశిల, అమరగిరి, జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం, చెల్లెపాడు పుష్కరఘాట్ల పైకి నీరు చేరుకోవడంతో ఆయా ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది.

సుంకేసుల 10 గేట్లు ఎత్తి..

రాజోళి: సుంకేసుల జలాశయం 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 37 వేల క్యూసెక్కుల వరద రాగా.. 39,170 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయం వద్ద..

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి వరద తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఆనకట్ట వద్ద ఒక్క గేట్ తెరిచి దిగువకు నీటిని వదిలారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 73,586 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరగా.. ఒక్క గేట్ ఎత్తి 27,295 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 33,067 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 883.3 అడుగుల నీటిమట్టం.. 206.0996 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.721 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 17.414 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

కేఎల్‌ఐ కాల్వలో మోటార్లు చోరీ


వాడ్యాల్ శివారులోని కేఎల్‌ఐ కాల్వలో మోటార్ విప్పి రాగివైరు తీసుకెళ్లిన దృశ్యం

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ శివారు కేఎల్‌ఐ కాల్వలో రైతులు అమర్చిన మోటార్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 4 మోటార్లు ఎత్తుకెళ్లారు. మరికొన్ని మోటార్ల కేబుల్ వైరు చోరీ చేసి తీసుకెళ్లారు. మరికొన్ని మోటార్లను విప్పి అందులోని రాగి వైరు పట్టకెళ్లారు. రైతులు మోటార్లు చోరీ కావడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు. ఏటా ఇలా చోరీలు జరుగడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు తెలిపారు. ఘటనపై పోలీసులకు కూడా ఇప్పుడు, గతంలో ఫిర్యాదు చేసిన్నట్లు రైతులు తెలిపారు. మోటార్ల దొంగలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లి గ్రా మ శివారులో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు న మోదు చేసినట్లు ఆదివారం ఎస్ఐ రమేష్ తెలిపారు. హనుమంతు గ్రామ శివారులో ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్‌హెచ్‌-44పై స్తంభించిన రాకపోకలు

జడ్చర్ల– కర్నూలు 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వాహనాల రాకపోకలు స్తంభించాయి. దివిటిపల్లి దగ్గర ఒకవైపు బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండగా మరోవైపు వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి భారీగా వాహనాలు నిలిచిపోయి.. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. – జడ్చర్ల


జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు


చిరుత సంచరించిన ప్రాంతంలో వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

చిక్కని చిరుత

- బోన్లు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో అన్వేషణ
- భయాందోళనలో పట్టణవాసులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిరుత సంచారం మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. పండుగ సాయన్న గుట్ట (టీడీ గుట్ట), డంపింగ్ యార్డు తదితర ప్రాంతాల్లో ఉన్న గుట్టలపై తరచూ తిరుగుతూ పరిసర ప్రాంతాల ప్రజలకు కనిపిస్తోంది. చిరుతను బంధించి అడవిలో వదలాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించగా.. అటవీ, పోలీసు అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రెండు వారాలుగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నా ఆచూకీ దొరకడం లేదు. చిరుతను బంధించేందుకు రెండు బోన్లు, సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లతో అన్వేషణ కొనసాగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కనిపించిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, రాత్రి, తెల్లవారుజామున బయట తిరుగొద్దని స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. ఓవైపు గాలింపు చర్యలు కొనసాగుతుండగా.. మరోవైపు చిరుత సంచరిస్తున్న వీడియోలు వైరల్‌గా మారుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. చిరుత ఒకటి ఉందా.. అంతకుమించి ఉన్నాయా అనే దానిపై స్పష్టత రావడం లేదు.


గుట్టపైన గాలింపు చేపడుతున్న బృందం

మళ్లీ కనిపించిన చిరుత..

పండుగసాయన్న గుట్ట(టీడీ గుట్ట)లో ఆదివారం ఉదయం చిరుత సంచరిస్తున్నట్లు పరిసర ప్రాంతాల ప్రజలు గుర్తించి తీసిన వీడియోలు వైరల్‌గా మారాయి. సున్నంబట్టి ప్రాంతంలోని పెట్రోల్ బంక్ సమీపంలో చిరుత కనిపించిన ప్రాంతానికి అదనపు ఎస్పీ రత్నం, సీఐ అప్పయ్య, ఎఫ్ఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓలు శశికళ, జీవిత, మానిక, రాధ చేరుకొని పరిశీలించారు. చూసిన వారితో మాట్లాడి సమాచారం సేకరించారు. రెండు చిరుతలను తాము ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అటవీశాఖకు చెందిన మూడు బృందాలు, పోలీసు సిబ్బంది గుట్టపైకి చేరుకొని డ్రోన్లతో గాలించినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. తమకు రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు అధికారులకు మొర పెట్టుకోగా అన్ని చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ వివరించారు.

జడ్చర్లలో భారీ చోరీ


చోరీ జరిగిన ఇంట్లో విచారిస్తున్న ఏఎస్పీ రత్నం, సీఐ తదితరులు

తాళం వేసిన ఇంట్లో 20 తులాల బంగారు నగలు అపహరణ

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి 20 తులాల బంగారు నగలు అపహరించిన ఘటన జడ్చర్లలో చోటుచేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. జడ్చర్ల శ్రీ సాయి వంశీ కాలనీలో నివాసం ఉంటున్న గడ్డంపల్లి వరలక్ష్మి శనివారం తన కూతురితో కలిసి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి బోనాల పండుగ సందర్భంగా వెళ్లారు. ఆదివారం ఉదయం పక్క ఇంటికి చెందిన వారు గేటు తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే ఇంటి యజమానురాలికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో ఇంటి యజమాని హుటాహుటీన ఇంటికి చేరుకుని చిందర వందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలించారు. బీరువాలో దాచి ఉంచిన 20 తులాల బంగారు నగలు, కొంత నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. గాజులు, చంద్రహారం, రెండు నక్లెస్‌లు, కమ్మలు, ఉంగరాలు మొత్తం 20 తులాల నగలు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్పీ రత్నం సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూతబడిన 'ఎత్తిపోతల' భవనం కూల్చివేత

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయకట్టు రైతులు
- ఇరిగేషన్‌శాఖ, పోలీసులకు ఫిర్యాదు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ 2వ ఎత్తిపోతల పథకం భవనాన్ని ఓ రైతు ఆదివారం ఉదయం కూల్చివేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకంలోని 2వ ఎత్తిపోతల పథకం 20, 25ఏళ్లుగా ఉపయోగంలేక మూతపడింది. అప్పట్లో ఐడీసీ వారు నిర్మించిన ఈ భవనంలో మోటర్లు, ఇతర పంపింగ్ సామగ్రిని ఉంచేవారు. కాలక్రమేణ భవనం మూతపడడంతోపాటు శిథిలావస్థకు చేరింది. కాగ ప్రతినిత్యం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యువకులు అక్కడ మద్యం తాగేందుకు అడ్డాగా మార్చుకున్నారు. ఇది గమనించిన ఆ భవనం పక్కన ఉన్న పొలం రైతు హుస్సేన్ పోకిరీల బాధ నుంచి తప్పించుకునేందుకు ఆ భవనాన్ని జేసీబీ సహాయంతో కూల్చివేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు శివరాజ్, ఆయకట్టు రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికార ప్రభుత్వం సాగునీటికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుండడంతో ఈ మూతపడ్డ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించేందుకు ఓవైపు తాము కృషిచేస్తుంటే ఇప్పుడిలా భవనం కూల్చివేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెందిన భవనాన్ని ఇష్టానుసారం కూల్చివేసిన వ్యక్తితో పాటూ జేసీబీని సీజ్ చేయాలని, అలాగే డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సోమవారం ఇరిగేషన్ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.


కూల్చిన ఎత్తిపోతల పథకం భవనం

చిన్నారిని వదిలేసిన గుర్తు తెలియని మహిళ


ఆస్పత్రి ఆవరణలో వదిలేసిన చిన్నారి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఆవరణలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని మహిళ ఆరు నెలల ఆడ శిశువును వదిలేసి వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలోని ఆక్సిజన్ ట్యాంక్ పక్కనే ఆరు నెలల ఆడ శిశువును వదిలేసి వెళ్లారు. పాప ఏడుస్తుండటంతో గమనించిన స్థానికులు ఆర్ఎంవో శిరీషకు సమాచారం ఇవ్వగా వెంటనే సదరు చిన్నారిని ఎస్ఎన్‌సీయూకు తరలించి చికిత్స అందించారు. ఆ చిన్నారికి గ్రహణం మొర్రి ఉండటం వల్లే సదరు మహిళ అక్కడ వదిలేసినట్లు స్థానిక సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ప్రస్తుతం చిన్నారి ఆయాసంతో ఇబ్బంది పడటం, పల్స్‌రేట్ తగ్గడంతో కొంత కండీషన్ ఇబ్బందికరంగా ఉందని, ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందిస్తున్నామని ఆర్ఎంవో తెలిపారు. ఈ ఘటనపై ఆస్పత్రి మరో ఆర్ఎంవో సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వెల్లడించారు.

గంజాయికి బానిసైన ఆటోడ్రైవర్

మహబూబ్‌నగర్ క్రైం: గంజాయికి ఓ 22 ఏళ్ల ఆటోడ్రైవర్ పూర్తిగా బానిసగా మారడంతో చివరకు డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన 22 ఏళ్ల యువకుడు ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల గంజాయి తాగడం అలవాటు చేసుకొని దానికి బానిసగా మారాడు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని ట్యాంక్ బండ్‌పై గంజాయి తాగుతున్నట్లు వచ్చిన సమాచారంతో అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో కోర్టు అనుమతితో సదరు యువకుడిని డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.